క్లుప్తంగా

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఆర్‌ఎస్‌ఎస్ నేత



తిరుపతి, మంగళం: ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ నాయకుడు శ్యాంజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆయనకు గాంధీజీ ఆత్మకథ సత్య శోధన, కన్యాశుల్కం పుస్తకాలను బహూకరించారు.

పెనగలూరుకు ప్రత్యేక సర్వీసు ఏర్పాటు



తిరుపతి నుంచి పెనగలూరుకు ఏర్పాటు చేసిన పల్లెవెలుగు సర్వీస్

తిరుపతి అర్బన్: తిరుపతి నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరుకు పల్లెవెలుగు సర్వీసును ఏర్పాటు చేసినట్లు తిరుపతి డీఎం బాలాజీ మంగళవారం తెలిపారు. ప్రతి రోజు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని 34వ ప్లాట్‌ఫాం నుంచి ఉదయం 8గంటలకు, సాయంత్రం 3 గంటలకు తిరుపతి నుంచి వయా రైల్వే కోడూరు, రాజంపేట మీదుగా పెనగలూరుకు ప్రత్యేకంగా పల్లెవెలుగు సర్వీసును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పెనగలూరుకు చెందిన వందల కుటుంబాలు తిరుపతిలో నివాసం ఉంటున్నాయని వివరించారు. ఈ క్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి చొరవతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పాకాల: ఎమ్మార్సీ కేంద్రంలో ఎస్టీయూ క్యాలెండర్‌ని ఎంఈఓ బాబ్జీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉపాధ్యాయులు ఎంఈఓని కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నూతన సంవత్సరం విద్యార్థులకు మేలు జరగాలని, విద్యా రంగంలో నూతన ఆవిష్కరణలు తీసుకుని రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి పి.ప్రభాకర్, అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కౌన్సిలర్ జార్జ్, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నాగరాజు, మురళీధర్, నవీన్, చిట్టిబాబు, ప్రతిభా, గౌరీదేవి, పుష్పలత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నేడు శారదాదేవి జన్మదినోత్సవ వేడుకలు

పాకాల: శ్రీరామకృష్ణ మందిరంలో బుధవారం దివ్య జనని శ్రీశారదాదేవి 171వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు రామకృష్ణ సేవా సమితి ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌సీ. రామచంద్రారెడ్డి తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాతం, అష్టోత్తర నామార్చన, ప్రసాద విని యోగం, 9 గంటలకు శ్రీ లలితా సహస్రనామార్చన, విశేషపూజ, పుష్పాంజలి, సమాంతరంగా హోమం, 11 గంటలకు అధ్యాపకురాలు డాక్టర్ సి.అరుణకుమారి శ్రీశారదాదేవి జీవితంపై ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే మధ్యాహ్నం భక్తులందరికి ప్రసాద వినియోగం ఉంటుందని, ఆలయానికి విచ్చేసే భక్తు లు అందరూ తప్పనిసరిగా కోవిడ్ నియమాలు పాటించాలని సూచించారు.

ఈవీఎంలపై అవగాహన



ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న అధికారులు

చంద్రగిరి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో రెవెన్యూ యంత్రాంగం ఓటర్లను చైతన్య పరిచేందుకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఏ.రంగంపేట గ్రామంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వినియోగించునే వారికి ఈవీఎం పనితీరును వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని చేప ట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి వినోద్ కుమకార్ మాట్లా డుతూ.. నూతన ఓటర్లతో ఈవీఎంలో ఓటు వేసే విధానాన్ని చూపించామన్నారు. పంచా యతీ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపుల నిర్వహణపై మంగళవారం అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ క్రమంలో రెండో విడత వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అందరికీ ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు క్యాంపులను నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసిందన్నారు. వైద్య శిబిరాల్లో ఏడు రకాల వైద్య పరీక్షలు, స్పెషలిస్ట్ వైద్య నిపుణులు తో పాటు వివిధ రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. మెడికల్ క్యాంపుల నిర్వహణ కోసం అధికారులతో నాలుగు స్పెషల్ టీంలను ఏర్పాటు చేశామన్నారు.

స్పందన సమస్యలను వేగంగా పరిష్కరించండి

స్పందన, డయల్ యువర్ కమిషనర్, జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చే ప్రజా ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాధిపతులతో ఆమె స్పందన ఫిర్యాదులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోపు ప్రజా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ప్రతి సమస్యకు చక్కని పరిష్కార మార్గాన్ని చూపించాల్సిన బాధ్యత సంబంధిత ఆ శాఖ అధికారిదేనన్నారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులురెడ్డి ఏసీబీ బాలసుబ్రమణ్యం రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, సెక్రటరీ రాధిక, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గోవిందధామం నూతన కమిటీ ప్రమాణస్వీకారం

తిరుపతి కల్చరల్: గోవింద ధామం శ్మశాన వాటిక నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా మాగం హేమచందర్, కార్యదర్శిగా లక్ష్మీదేవి, కోశాధికారిగా జీవన్‌కుమార్‌లతో పూర్వపు అధ్యక్షుడు ఆదం సుధాకర్‌రెడ్డి గోవింద ధామంలోని శ్రీసంకల్ప సిద్ధి మహాగణపతి ఆలయం వద్ద ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాగం హేమచందర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ వారు రోటరీ క్లబ్ వారికి కేటాయించిన స్థలంలో వీరబాబు సత్యహరిశ్చంద్ర హిందూ రుద్రభూమి, ఆర్యవైశ్య అఫీషియన్స్ అండ్ ప్రొఫెషనల్ సంస్థలను కలుపుకొని మహా ప్రస్థానం సేవా సమితిగా రిజిస్టర్ చేశామన్నారు. ఎంతో మంది దాతల దాతృత్వంతో నిర్మించి మున్సిపల్ కార్పొరేషన్ వారి సహకారంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ నూతన కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి ఆదిలక్ష్మి గోవింద ధామానికి రూ.10 వేలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు, దాతలు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజ్ కుమార్, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేపడుతున్న గోవింద ధామం నూతనకమిటీ ప్రతినిధులు

మొదటి ఘాట్ రోడ్డులో బొలెరో వాహనం బోల్తా





బొలెరో బోల్తాపడిన ప్రదేశంలో ప్రయాణికులు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు, చెన్నైకు చెందిన ఐదుగురు భక్తులు బొలెరో వాహనంలో తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని మొదటి ఘాట్‌రోడ్డు మీదుగా కిందకు దిగుతుండగా రెండో మలుపు వద్ద బొలెరో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జీపులోని భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వాహనం నుంచి వారిని బయటకు తీసుకువచ్చారు. ఇంతలో అక్కడకు చేరుకున్న ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది గాయపడిన వారిని తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

వైఎస్‌ఆర్ సీపీ బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి నిరాకరణ

- నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: పంచాయతీ కార్యదర్శి

చంద్రగిరి: రాజకీయ పార్టీల బ్యానర్లు, తోరణాల ఏర్పాటు, వ్యక్తిగత బ్యానర్‌లను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రగిరి పంచాయతీ సెక్రటరీ మహేశ్వరయ్య స్పష్టం చేశారు. బుధవారం చంద్రగిరిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందు కోసం పట్టణంలో ఈ నెల 15వ తేదీ వరకు వైఎస్‌ఆర్ సీపీ బ్యానర్‌లు, తోరణాల ఏర్పాటు కోసం పార్టీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అనుమతులు కోరుతూ పంచాయతీ అధికారులకు అర్జీను అందజేశారు. అర్జీని పరిశీలించిన సెక్రటరీ మహేశ్వరయ్య.. అనుమతులు ఇవ్వడం కుదరదని రాతపూర్వకంగా తెలిపి, అర్జీను తిరస్కరించారు. పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం రాజకీయ పరంగా, వ్యక్తిగతంగా ఫ్లెక్సీలు, బ్యానర్‌లు ఏర్పాటు చేయడంపై చంద్రగిరి మండలంలో నిషేధించినట్లు తెలిపారు. ప్రజా స్వామ్య పరిరక్షణలో భాగంగా కూడా ఫ్లెక్సీలు, బ్యానర్‌ల ఏర్పాటుకు అనుమతులను నిషేధించినట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణానికి హాని కలిగించిన, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తూ ఫ్లెక్సీలు, బ్యానర్‌లను ఏర్పాటు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రమజీవుల కోసం పోరాడిన యోధుడు బర్దన్

తిరుపతి కల్చరల్: కార్మిక నేతగా, లౌకికవాదిగా, త్తమ నేతగా జీవితాంతం శ్రమజీవుల కోసం పోరాడిన యోధుడు ఏబీ.బర్దన్ అని సీపీఐ కమిటీ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి కొనియాడారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ.బర్దన్ 8వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏబీ బర్దన్ కార్మిక నేతగా ఏఐటీయూసీ జాతీయ నేతగా పలు ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగిడి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారని తెలిపారు. సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, విశ్వనాథం, శివ, కేవై.రాజా, ఎన్‌డీ.రవి, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, కాశయ్య, సీహెచ్.శివ, ఎఐఎస్ఎఫ్ నేతలు బండి చలపతి, ఉదయ్‌కుమార్, వినయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఏబీ బర్దన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

నేడు భారీ బైక్ ర్యాలీ

చంద్రగిరి: గడపగడపకు మన ప్రభుత్వం చంద్రగిరిలో బుధవారం చేపడుతున్న క్రమంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్‌ఆర్ సీపీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు నాగాలమ్మ కూడలి నుంచి దాసరవీధి చివరి వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ర్యాలీ అనంతరం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సైన్స్ సెంటర్‌లో క్రియేటివ్ ఎబిలిటీ కోర్స్

తిరుపతి(అలిపిరి): ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు సైన్సు సెంటర్‌లో సంక్రాంతి వెకేషన్ క్రియేటివ్ ఎబిలిటీ కోర్సు నిర్వహిస్తున్నామని.. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సైన్స్, జీవశాస్త్రాలపై ప్రత్యేక ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడానికి ఓ కార్యాచరణ ఆధారిత అభ్యాసమని.. కోర్సు సమయంలో విద్యార్థులు సెల్స్, సెల్ ఆర్గానెల్లెస్, సెల్ డివిజన్లు, మైటోకాండ్రియా, న్యూక్లియస్, క్లోరోప్లాస్ట్ తదితర సెల్యులార్ కాంపోనెంట్ల వంటి కణ అవయవాలను వేరు చేయడం గురించి సవివరంగా నేర్చుకుంటారని పేర్కొన్నారు. అన్ని కార్యకలాపాలు సెల్(కణాలు), సెల్ భాగాలపై ప్రాథమిక అవగాహనపై ఆధారపడి ఉంటాయని.. ప్రయోగాలతో విద్యార్థులకు ఉత్సుకతను పెంచుతాయని తెలిపారు. కోర్సు నిర్వహించడానికి అవసరమైన వస్తువులు, పరికరాలు ప్రోగ్రామ్‌లో భాగంగా అందించబడుతాయని తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటలకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 కోర్సు క్లాసులు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 ఉంటుందని, పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నందున మొదటగా రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రాతిపదికన ఆధారపడి ఉంటుందన్నారు. వివరాలకు ఎడ్యుకేషన్ విభాగాన్ని వ్యక్తిగతంగా సంప్రదించాలని లేదా 0877–2286202/203, 91–7989694681 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో టీటీడీ ఆలయాలు, వసతి సముదాయాలు, వివిధ కార్యాలయాలలో పనిచేయుటకు మహిళా ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీఈవో శేష శైలేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని.. ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ మైదానంలో ఈ నెల 10వ తేదీన ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నా రు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 8వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు, చిరునామా, ఉద్యోగ, అర్హత, జీత భత్యాలు, ఇతర పూర్తి వివరాలకు కార్పొరేషన్ వెబ్‌సైట్ http://slsmpc.in/ ను సంప్రదించాలని కోరారు.

బస్టాండ్‌లో ట్రాఫిక్ కష్టాలు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా రాత్రి 7 గంటలు దాటితే బస్టాండ్ నుంచి బస్సు బయటకు రావడానికి 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతోంది. పలువురు అడ్డదిడ్డంగా ఆర్టీసీ సర్వీసులు పెట్టేస్తున్నారు. దీంతో మిగిలిన సర్వీసులను తిప్పలు తప్పడంలేదు. ప్రయాణికులు నానా ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి సమయంలో డ్యూటీలు చేయాల్సిన ఆర్టీసీ ఉద్యోగులు సక్రమంగా ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ఈ విషయంపై తిరుపతి బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడును వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.

విద్యుత్‌షాక్‌తో పాడి ఆవు మృతి

చంద్రగిరి: విద్యుత్‌షాక్‌తో పాడి ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గంగుడుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు వివరాల మేరకు.. గంగుడుపల్లికి చెందిన బోడిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి పాడి ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం తన పాడి ఆవును షెడ్డులో ఉంచి గడ్డి కోసం వెళ్లాడు. ఈ క్రమంలో ఆవుల షెడ్డు పక్కనే ఇంటి నిర్మాణం కోసం విద్యుత్ కనెక్షన్ లాగారు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు ఆవుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పాడి రైతు ఘటన స్థలానికి చేరుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం 6నెలల చూలుతో ఆవు ఉంది. మృత్యువాత పడడంతో తీవ్ర కలత చెందాడు. సమాచారం అందుకున్న వెటర్నరీ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం చేసి ఖననం చేశారు.



7న బహుజనుల ర్యాలీకి తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రశేఖర్

తిరుపతి కల్చరల్: బహుజనులు విద్య, వైద్యం, ఆర్థిక, ఉపాధి రంగాలలో అభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న అవగాహన సదస్సులో భాగంగా ఈ నెల 7వ తేదీన 11 గంటలకు నగరంలో చేపట్టే ర్యాలీకి బహుజనులందరూ పాల్గొని జయప్రదం చేయాలని దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా బహుజనులందరూ తమ హక్కులు సాధించినప్పుడే అభివృద్ధి సుసాధ్యమని ఆ దిశగా బహుజనులందరూ ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను భారత రాజ్యాంగాన్ని పాఠ్యపుస్తకాలలో 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఇంగ్లీషు మీడియా పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం టీచర్లను నియమించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా బహుజనుల విద్యార్థులకు విదేశీ విద్యా పథకం కల్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ మేరకు బహుజనుల హక్కులపై ఆర్టీసీ బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియం వరకు ర్యాలీ చేపట్టి అనంతరం అక్కడ అవగాహన సదస్సు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బహుజన మేధావులు, బహుజనులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు డీఎస్ఎస్ ప్రతినిధి ఎస్.చంద్ర పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: పంజాబీ డాబా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శానంబట్లకు చెందిన జగన్నాథరెడ్డి(56) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ప్రమాద పరిస్థితిని చూసి మోహిత్‌రెడ్డి చలించి పోయారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాద కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మల్లయ్యపల్లి–గంగుడుపల్లి మధ్య జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని శానంబట్ల ప్రజలు వాపోయారు. ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ

భాకరాపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జరిగే పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ సీవీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. చిన్నగొట్టిగల్లు జగనన్న సమావేశ మందిరంలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది రూ.5.39 కోట్లు వ్యయంతో ఉపాధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఇందులో ఈజీఎస్ కింద 1347 పనులకు గాను కూలీలకు రూ.3,88,62,222 , మెటీరియల్ కింద రూ. 34,04,989, పంచాయతీ రాజ్ పనులకు 34 పనులకు రూ.1,08,63,804, సర్వశిక్షా అభియాన్ పనులకు 4 పనులకు రూ.8,3,332 చెల్లించామన్నారు. ఇందుకు సంబంధించిన పనులను 13 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందన్నారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, డీఆర్వో భాగ్యలక్ష్మీ, అంబుడ్స్‌మెన్ జడ్జి రాచానాయుడు, ఏపీడీ పద్మలత, ఎస్ఆర్‌పీ రవి, సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

7న మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, పక్కన కొటాల చంద్రశేఖర్‌రెడ్డి

భాకరాపేట: ఈనెల 7న చంద్రగిరి మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి కోరారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు జగనన్న సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. చంద్రగిరి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా ఎంపికైన కొటాల చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి నమ్ముకున్న వారికి పెద్ద పీట వేస్తారన్నారు. ఈ నెల 7న చంద్రగిరి మార్కెట్ యార్డులో జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి పెద్ద ఎత్తున తరలి రావాలని కొటాల చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, వైఎస్‌ఆర్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకులు బాధ్యతగా సేవలందించాలి



ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

తిరుపతి కల్చరల్: బ్యాంకులు బాధ్యతగా భావించి మహిళా సాధికారత కోసం సేవలు అందించాలని కెనరా బ్యాంక్ జీఎం రవివర్మ పిలుపు నిచ్చారు. కెనరా బ్యాంక్ సీఎస్‌ఆర్ పథకం ద్వారా రాస్ సేవా నిలయంలో మహిళా పొదుపు సంఘాలలోని నిరుపేద మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు సమాజంలో ఒక భాగంగా రుణాలు ఇవ్వడం, వసూలు చేయడం కాకుండా వితంతువులు, వికలాంగులు, నిరుపేదలను గుర్తించి రాస్ సంస్థ ద్వారా కుట్టుమిషన్లు పంపిణీ చేయాలన్నారు. 100 మంది లబ్ధిదారులకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. కెనరా బ్యాంకు ఏజీఎం నాగరాజరావు, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, కెనరా బ్యాంక్ అధికారులు శరవణ, ఉమాపతి, రియాజ్, వినాయక తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ముందుకు రావాలి

తిరుపతి తుడా: రక్తదానం చేసేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉండే ఎంతో మంది రోగులు, క్షతగాత్రులకు మీరు ఇచ్చే రక్తం వారి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. స్విమ్స్ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం నిత్యం దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల శస్త్రచికిత్సలకు, క్యాన్సర్ తదితర రోగులకు ప్రతిరోజు రక్తం అవసరం అన్నారు . ఈ ప్రాధాన్యతను గుర్తించి యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగంలో రక్త దాతలు బ్లడ్ డొనేషన్ చేయాలని పిలుపునిచ్చారు. అన్ని పనివేళల్లో రక్తదాతలు స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాన్ని నేరుగా గానీ లేదా ల్యాండ్ లైన్: 0877–2287777 (కొనసాగింపు 2249) అనే ఫోన్ నెంబర్ను సంప్రదించి స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేయవచ్చని తెలిపారు.